

తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని శనివారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు.
- వికారాబాద్, డిసెంబర్ 21

# నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, డిసెంబర్ 21 : పరిగి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీలోని కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. పరిగి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, పలు డబుల్ రోడ్ల నిర్మాణం, రెండు ఫోర్ ట్రాక్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు.

# ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి చేయాలి



దోమలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

దోమ, డిసెంబర్ 21 : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేయాలని ఎంపీడీవో మహేశ్‌బాబు, తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇచ్చిన గడువులోపు ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# అంబులెన్స్‌లు ప్రారంభం



సిబ్బందితో జిల్లా వైద్యాధికారి

వికారాబాద్, డిసెంబర్ 21: కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ రెండు 108 అంబులెన్స్‌లను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బొంరాస్‌పేట, దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సిబ్బంది, 108 సిబ్బంది పాల్గొన్నారు.

# కాంట్రాక్టు ఏఎన్ఎంలకు రాత పరీక్షలు రద్దు చేయాలి

- అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- వికారాబాద్ చౌరస్తాలో 180 మంది ఏఎన్ఎంల ధర్నా



జిల్లా వైద్యాధికారికి వినతి పత్రాన్ని అందజేస్తున్న ఏఎన్ఎంలు (ఫైల్)



వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

వికారాబాద్, డిసెంబర్ 21 : వారంతా కాంట్రాక్టు ఏఎన్ఎంలు. 22 ఏండ్ల నుంచి పని చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారు. 2006లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మొదటి విడుతగా ఉన్న ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏఎన్ఎంలు కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్నారు. ఒక్కో ఏఎన్ఎం దాదాపు 10 నుంచి 22 ఏండ్లుగా వైద్య శాఖలో పనులు చేస్తున్నారు. వారికి రూ.27వేల వేతనం అందిస్తున్నారు. డిసెంబర్ 29న ఏఎన్ఎంలకు రాత పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ రాత పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారినే రెగ్యులరైజ్ చేస్తామనడం సరికాదు. జిల్లాలో ఉన్న 180 మంది ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సమ్మెకు దిగారు. రాత పరీక్షను వెంటనే రద్దు చేసి, అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ధర్నాలు చేపడుతున్నారు.

**రెండు రోజుల నుంచి..**

జిల్లా వైద్య శాఖాధికారి కార్యాలయం ఎదుట జిల్లాలోని ఏఎన్ఎంలు 48 గంటలు, రెండు రోజులు నిరసన దీక్షకు దిగారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ వీరి సమ్మెకు మద్దతు తెలిపారు. 22 ఏండ్ల నుంచి గ్రామాల్లో పీహెచ్‌సీ, ప్రభుత్వ దవాఖానల్లో రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తూ.. చాలీచాలని జీతాలతో జీవితాలు వెళ్లదీస్తూ.. కుటుంబాలను పోసిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలందరికీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి.. ఈ నెల 29న నిర్వహించే రాత పరీక్షలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిరసన దీక్షలు చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో చేపట్టిన నిరసనలు, ధర్నాలు చేశారు. వీరి దాదాపుగా గంటకు పైగా రోడ్డుపై ధర్నా చేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. పోలీసులు జోక్యం చేసుకున్నా ధర్నాను విరమించలేదు. చాలా సేపటి తర్వాత ఏఎన్ఎంలు శాంతించి ధర్నాను విరమించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

### అందరినీ రెగ్యులరైజ్ చేయాలి



18 ఏండ్లుగా కాంట్రాక్టు ఏఎన్ఎంలుగా పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. మారుమూల గ్రామాలకు సైతం వెళ్లి చిన్నారులు, మహిళలకు వైద్య పరీక్షలు అందిస్తున్నాం. 2006లో కాంగ్రెస్ ప్రభుత్వం రాత పరీక్ష లేకుండానే ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేసింది. రాత పరీక్షను రద్దు చేసి అందరినీ రెగ్యులరైజ్ చేయాలి. రెగ్యులరైజ్ చేయక పోవడంతో 18 ఏండ్ల నుంచి రూ.27వేల వేతనంతోనే కాలం వెళ్లదీస్తున్నాం. 29న నిర్వహించే పరీక్షను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి.

- లీలావతి, జిల్లా అధ్యక్షురాలు, మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్, వికారాబాద్

### మా సమస్యలు పట్టవా



వైద్య ఆరోగ్య శాఖలో16 ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్నా. మారుమూల గ్రామాలకు వెళ్లి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. గతంలో మాదిరిగానే రాత పరీక్షలు లేకుండా ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి. అందరం సమానంగా పని చేస్తున్నాం. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి. ఎన్నో ఏండ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న వారికి రాత పరీక్షలు నిర్వహిస్తామనడం సమంజసం కాదు. మా సమస్యలను పట్టించుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి.

- వెంకటమ్మ, ఏఎన్ఎం, యాలాల

### రాత పరక్షను రద్దు చేయాలి



2003 నుండి వైద్య శాఖలో పని చేస్తున్నా. దాదాపు 22 ఏండ్లుగా వైద్య శాఖలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నాం. మొదటి విడుతగా అప్పట్లో మాకంటే ముందు ఉన్న వారిని రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేసింది. డిసెంబర్ 29న రాత పరీక్ష పెట్టి ఉత్తీర్ణులైన వారిని మాత్రమే రెగ్యులరైజ్ చేస్తామనడం సరికాదు. రాత పరీక్షలను రద్దు చేసి.. అందరిని రెగ్యులరైజ్ చేయాలి. వైద్య శాఖలో ఎన్నో ఏండ్లుగా పని చేస్తున్నాం. మా సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలి.

- జయలక్ష్మి, యూపీహెచ్, తాండూరు

# గణితంలో పట్టు సాధించాలి

- విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలి
- సేవారత్న అవార్డు గ్రహీత డాక్టర్ వెన్న ఈశ్వరప్ప, పరిగి మాజీ సర్పంచ్ పార్థసారథి
- పాఠశాలల్లో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



పరిగి : విద్యార్థినులకు పుస్తకాలు అందజేస్తున్న మాజీ సర్పంచ్ పార్థసారథి, ఈశ్వరప్ప

పరిగి, డిసెంబర్ 21 : ప్రతీ విద్యార్థి శ్రీనివాస రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకొని గణితంలో పట్టు సాధించాలని పరిగి మాజీ సర్పంచ్ సిద్ధాంతి పార్థసారథి, సేవారత్న అవార్డు గ్రహీత డాక్టర్ వెన్న ఈశ్వరప్ప పేర్కొన్నారు. శనివారం పరిగిలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకులంలో గణిత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన గణితశాస్త్ర ప్రదర్శనను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలన్నారు. ప్రతీ విద్యార్థికి విలువలు, మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాలని సూచించారు. క్రమశిక్షణతో కూడిన జీవితం, విద్య అభివృద్ధి ఎంతో తోడ్పడుతాయని వారు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఓ లక్ష్యం ఏర్పరచుకొని చదవాలని సూచించారు. సందర్భంగా విద్యార్థులకు పలు పుస్తకాలు అందజేయడంతోపాటు బ్లాక్ బోర్డును అందించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ హరిత, నాయకులు పెంటయ్యగుప్త, విజయ్‌కుమార్, నరసింహ, గోవింద్‌నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



మరపల్లి :పంచలింగాల్ పాఠశాలలో గణిత దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

**పంచలింగాల్‌లో..**

మరపల్లి : మండల పరిధిలోని పంచలింగాల్‌లో ఉన్న ఉన్నత ప్రాథమిక పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల పరికరాలను తయారు చేసి వాటిపై అవగాహన కల్పించారు. శ్రీనివాస రామానుజన్ గణితంలో ప్రవేశ పెట్టిన సూత్రాలు దేశ విదేశాల్లో ఆచరణలో ఉన్నాయని పాఠశాల హెచ్ఎం కేశవులు విద్యార్థులకు వివరించారు. ప్రతీ విద్యార్థి రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగు జాడల్లో నడువాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో టీచర్లు నవీన, బాలమణి, మల్లేశం, దివ్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు టీవీ అందజేత



అంతారం పాఠశాలలో టీవీని ప్రారంభిస్తున్న ఎంఈవో హబీబ్ అహ్మద్

దోమ, డిసెంబర్ 21 : మండల పరిధిలోని ఎంపీయూపీఎస్ అంతారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శిక్షణ (ప్రేరణ) ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలకు టీవీతో పాటుగా ఇంటర్ నెట్ కనెక్షన్‌ను అందజేసి శిక్షణ ఫౌండేషన్ సంస్థ సేవా భావాన్ని చాటుకున్నది. పాఠశాలకు అందజేసిన టీవీని ముఖ్య అథితిగా హాజరైన ఎంఈవో హబీబ్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. విద్యార్థులకు మంచి మనసుతో సేవ చేసిన శిక్షణ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థను అభినందించారు. కార్య క్రమంలో హెచ్ఎం హన్మంతు, ఉపాధ్యాయులు భూదేవి, వెంకటయ్య, లావణ్య, కవిత, శిక్షణ ఫౌండేషన్ మెంటర్ యాదగిరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అమిత్ షా క్షమాపణ చెప్పాలి

- అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన దళిత నాయకులు
- నివాళులర్పించి.. నిరసన వ్యక్తం చేసిన నాయకులు



యాలాల : నిరసన తెలుపుతున్న కుల వివక్ష పోరాట సంఘం నాయకులు

యాలాల, డిసెంబర్ 21 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను రాజ్యసభలో అవమానించిన బీజేపీ కేంద్ర హోం మంత్రి అమిత్ షా బేషరతుగా క్షమాపణ చెప్పాలని కుల వివక్ష పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. శనివారం కుల వివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలు సరి కాదన్నారు. అంబేద్కర్‌ను కించపరిచేలా దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన అమిత్ షా చేసిన వ్యాఖ్యలను సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంబేద్కర్‌ను అవమానిస్తే దేశం సహించబోదన్నారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మతోన్మాద మంత్రికి బుద్ధి ప్రసాదించాలని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన మంత్రి ఇలా మాట్లాడటం ఎంత వరకు స మంజసమన్నారు. అంబేద్కర్‌ను అవమానించడమంటే దేశ ప్రజలను అవమానించినట్లే అవుతుందన్నారు. కార్యక్రమంలో సం ఘం నాయకులు పాల్గొన్నారు.

**అంబేద్కర్‌ను అవమానిస్తే సహించం**

**మర్పల్లి :** అంబేద్కర్‌ను అవమానిస్తే సహించేదిలేదని అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు శివ అన్నారు. పార్లమెంట్‌లో హోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాతను తన వ్యాఖ్యలతో కించ పర్చారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్‌ను ప్రపంచవ్యాప్తంగా కొనియాడుతుంటే ఈ దేశంలో మాత్రం నాయకులు ఇలా వ్యవహరిచడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, నాయకులు సుభాశ్ యాదవ్, రామేశ్వర్, రతన్, పాండు నాయక్, దన్ను, వివిధ యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మర్పల్లి : అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు


# విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

- పాఠశాలల ప్రధానోపాధ్యాయులు
- స్కూళ్లలో ఘనంగా ఆహార దినోత్సవం



పరిగి : వివిధ రకాల వంటకాల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఉస్మాన్ అలీ

పరిగి, డిసెంబర్ 21 : పోషక విలువలతో కూడిన ఆహారం అందించడం ద్వారా తమ పిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని పరిగి మండలం మిట్టకోడూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ ఉస్మాన్ అలీ పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన ఆహార దినోత్సవం సందర్భంగా పలు రకాల వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా లభించే కూరగాయలు, ఆకుకూరలు, పాల ఉత్పత్తులు పిల్లలు ఆరోగ్యంగా ఎదగడానికి తోడ్పడతాయని చెప్పారు. చక్కటి పోషక విలువలతో కూడిన ఆహారం అందించడం ద్వారా తమ పిల్లల ఎదుగుదలకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య, నర్సింహులు, రాజు, కవిత, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్ : గోఖఫస్లవాద్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

**తల్లిదండ్రులకు అవగాహన**

**దౌల్తాబాద్ :** మండల పరిధిలోని గోఖఫస్లవాద్‌లో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. శనివారం తెలంగాణ ఆహార దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఇండ్లల్లో చేసే వంటకాలు చూయిస్తూ.. తినే ఆహారంలో పిండి పదార్థాలు, మాంసకృత్తులు, చిరుధాన్యాలు తదితర పౌష్టికాహార పదార్థాలు తినేలా చూడాలని ఉపాధ్యాయులు సూచించారు. విద్యార్థులకు గోరు వెచ్చని తాగునీటిని తాగించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయమ్మ, ఉపాధ్యాయులు శాణమ్మ, రమేశ్, వెంకటేశం, మొయినొద్దీన, రేణుక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పూడూరు: కద్మూర్ పాఠశాలలో ఆహార దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

**కద్మూర్‌లో..**

**పూడూరు :** ప్రస్తుత తరుణంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందక రోగాల బారిన పడుతున్నారని హెచ్ఎం మధు పేర్కొన్నారు. శనివారం పూడూరు మండల పరిధిలోని కద్మూర్ ప్రాథమిక పాఠశాలలో ఆహార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పౌష్టికాహారంపై పలు సలహాలు ఇచ్చారు. పాఠశాల విద్యార్థులతో పలు రకాల చిరు ధాన్యాలతో పౌష్టికాహారం తయారు చేయించి తోటి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ లక్ష్మి, ఉపాధ్యాయులు మోసెస్, ఖాజామోహినొద్దీన్, శ్రీను, అనూష, హరీశ్‌బాబు, చిరుధాన్యాల దాత అనిల్, బందయ్య తదితరులు పాల్గొన్నారు.

## బొంపల్లి తండాలో

# గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం



బొంపల్లి తండాలో ఆవులకు చూడి పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆనంద్

దోమ, డిసెంబర్ 21 : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని బొంపల్లి తండాలో పాడి పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించినట్లు దోమ ఇన్‌చార్జి పశువైద్యాధికారి డాక్టర్ ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండాలో 58 ఆవులకు పరీక్షలు నిర్వహించి చూడిలో ఉన్న పశువులకు బలవర్ధక మందులు అందజేశామని తెలిపారు. 18 లేగ దూ డలకు నట్టల మందులను పంపిణీ చేశామని తెలిపారు. 56 మేకలకు సంబంధించిన మం దులు రైతులకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ స్వప్న, సిబ్బంది బాబయ్య, వెంకటయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు షీటీంపై అవగాహన ఉండాలి



విద్యార్థులకు షీటీంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పూడూరు, డిసెంబర్ 21 : పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు షీటీంపై అవగాహన ఉండాలని పరిగి సబ్ డివిజన్ షీ టీం ఇన్‌చార్జి నర్సింహులు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని అంగడి చిట్టంపల్లి ఉన్నత పాఠశాలలో షీటీంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులను ఎవరైనా ఆకతాయిలు వేధించినా, బెదిరించినా, అవమానించినా వెంటనే 100 లేదా 181 నంబర్లకు నేరుగా ఫోన్ చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాల్యవివాహాలు చేయడం, పిల్లలతో పనులు చేయించడం, మానవ అక్రమ రవాణా చేయడం తదితర చట్ట విరుద్ధమన్నారు. యువకులు మద్యపానం, గంజాయి, డ్రగ్స్ తదితర చెడుమార్గాలను అలవర్చుకోవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి మోసపోవద్దని తెలిపారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం జరీనా, ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు మనీషా, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



దోమ, డిసెంబర్ 21 : మండల పరిధిలోని అయినాపూర్‌కు చెందిన మేకల అనంతయ్య సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ శనివారం మృతుడి భార్య, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో లింగయ్య, కృష్ణయ్య, నర్సింహులు, మల్లయ్య, నారాయణ, ఇస్తయ్య, బాలరాజు పాల్గొన్నారు.